పచ్చిరొట్టతో రైతుకు మేలు

● భూసారం పెరగడంతో పాటు అధిక పంట దిగుబడి

మహాముత్తారం: భూసారం పెంచడంతోపాటు పంటల అధిక దిగుబడి రావడంలో పచ్చిరొట్ట ఎరువులు కీలక పాత్ర పోషిస్తాయి. జీలుగా, జనుము పిల్లిపెసర, పెసర పైర్లను నేలలో దున్నితే ఇది పచ్చిరొట్టగా పనిచేస్తుంది. పచ్చిరొట్ట ఎరువు ఉపయోగించడం వల్ల ప్రయోజనాలు చాలా ఉంటాయని మండల వ్యవసాయ అధికారి సతీశ్ వివరించారు.



పచ్చిరొట్టపై రైతులకు వివరిస్తున్న ఏఓ సతీశ్

ఇలా విత్తి దున్నాలి..

ఎకరాకి జీలుగలు 12నుంచి 16కిలోలు, జనుము 10నుంచి 12కిలోలు, పెసర, పిల్లిపెసర 6నుంచి 8కిలోల చొప్పున చల్లుకోవాలి. వేసవి దుక్కి పూర్తి కాగానే తొలకరి వర్షం పడగానే వీటిని పొలమంతా చల్లాలి. పూత దశకు రాకముందే (ఆకులు, కర్రలు లేతగా ఉన్నప్పుడే)పొలమంతా నీరు పట్టించి కలియదున్నాలి. తొందరగా భూమిలో ముగుగడానికి అవసరమైతే ఎకరాకు 25కేజీల సింగిల్ సూపర్ పాస్పెట్ చల్లాలి. ఆకులు లేతగా ఉండటం వల్ల పోషకాలు ఏక్కువగా ఉంటాయి. నేలలో పూర్తిగా కలిసి పోయి పంట పండేందుకు అవసరమైన పోషకాలు లభిస్తాయి.

పచ్చిరొట్టతో లాభాలు

- నేలకు కావల్సిన సేంద్రియ పదార్థాలు లభించడమే కాకుండా భౌతిక రసాయన లక్షణాలు పెరుగుతాయి.
- పచ్చిరొట్ట వేరుబుడిపల్లో ఉన్న బ్యాక్టరీయా ద్వారా వాతావరణంలోని నత్రజనిని మొక్కకు అందిస్తుంది.
- పంటలు మేలుచేసే నేలకు సంబంధించిన జీవరాసులు పెరుగుతాయి.
- భారీ వర్షాలు కురిసిన సమయంలో నేలకోతకు గురికాకుండా ఉంటుంది.
- పైర్లు నేల అడుగు పొరలనుంచి పోషకాలు తీసుకొని నీటిలో కుళ్లిన పంటకు అందుతాయి. చౌడు సమస్య తగ్గుతుంది.
- వేర్లు లోపలికి వెల్లడం వల్ల నేల గుల్ల భారీ నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.
- నత్రజని పెరగడం రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుంది. యూరియా వాడకం తగ్గించవచ్చు.
- రసాయన ఎరువులపై పెట్టే ఖర్చు 15నుంచి 20శాతం వరకు తగ్గుతుంది.

క్లుప్తంగా

ప్రజావాణికి 46 దరఖాస్తులు



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి పలు సమస్యలపై 46 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ సోమవారం పేర్కొన్నారు. దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్దారం ఎంపీటీసీగా సేవలు అందించి పదవీ కాలం పూర్తయిన బొడ్డు సమ్మయ్యను గ్రామంలో సేవాలాల్ సేనా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు సంతోష్ నాయక్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంతోష్ నాయక్ మాట్లాడుతూ.. సమ్మయ్య ప్రజలకు అందుబాటులో ఉండి ఎంతో సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తిరుపతి రెడ్డి, లక్ష్మీ నారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు

భూపాలపల్లి రూరల్: సబ్సిడీపై వివిధ రకాల పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని భూపాలపల్లి మండల పశు వైద్యాధికారి తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశువుల యాజమానులు (రైతులు) ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జంగేడు పశు వైద్యశాలలో విత్తనాలు సబ్సిడీపై అందించనున్నట్లు తెలిపారు.

నాయకుల ముందస్తు అరెస్టు

కాళేశ్వరం: గ్రూప్ 2పోస్టుల పెంపు, డీఎస్సీ పరీక్షల వాయిదాపై 'చలో ప్రగతి భవన్'కు పిలుపునివ్వగా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. వారిని వేర్వేగా ఎస్సై బి.చక్రపాణి సోమవారం అరెస్టు చేశారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ఎస్ఎస్తాడ్వాయి: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఎస్సై సీసీకెమెరాల ఏర్పాటు, గంజాయి, గుడుంబా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో సుమారుగా వంద సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తామన్నారు. ఆగస్టు పదివరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు విరాళాల సేకరణతోపాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీలకు వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి గ్రామంలో వ్యాపారుల నుంచి ఉద్యోగులు, యువత వరకు గ్రూప్‌లో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేస్తున్నామని తెలిపారు. మండలాన్ని గుడుంబా, గంజాయి రహిత మండలంగా ప్రజల సహకారంతో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. గంజాయి మత్తుకు యువత అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు.

వరదలపై అవగాహన

గోవిందరావుపేట: వరదల సమయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పస్రా ఎస్సై కమలాకర్ తెలిపారు. మండల పరిధిలోని రాఘవపట్నం గ్రామంలో సోమవారం గ్రామస్తులకు వరదలపై అవగాహన కల్పించారు. గ్రామంలో వరద తాకిడి పెరిగితే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచనలు చేశారు. ఏదైనా ప్రమాదం అనిపిస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలన్నారు. వరద తాకిడిని అంచనా వేస్తూ ముంపు ప్రాంతాన్ని ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

కళాశాల అభివృద్ధికి చేయూత

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాల అభివృద్ధి పై అఖిల పక్ష నాయకులు, గ్రామస్తులతో సోమవా రం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వి ద్యార్థులకు తక్షణ అవసరాలైన బెంచీల ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ.20వేలు, సీపీఎం నాయకులు రూ.10వేలు, 1977–78 పాఠశాల పూ ర్వ విద్యార్థుల తరుపున చిట్టెం యాకయ్య రూ.20వేలు ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. కాగా పాఠశాల అభివృద్ధికి కలెక్టర్ దివాకర ప్రత్యేక నిధుల నుంచి రూ.10లక్షలు ప్రకటించడంతో హర్షంవ్యక్తం చేశారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అకడమిక్ ఇన్‌చార్జ్ అమ్మిన శ్రీనివాస రాజు, సొసైటీ అధ్యక్షుడు చిడెం మోహనరావు, తోట మల్లికార్జునరావు, గ్యానం వాసు, కుమ్మరి శ్రీను ఉన్నారు.

చర్య తీసుకోవాలని ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కాటారం: కాటారం మండలం బయ్యారం గ్రామానికి చెందిన రామినేని లక్ష్మయ్య అనే గిరిజనుడి పట్టా భూమిని నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గిరిజన, ఆదివాసీ సంఘాల నాయకులు జిల్లా కేంద్రంలో సోమవారం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంబలపహాడ్ శివారులోని సర్వే నంబర్ 30/బిలో గల 7.14 ఎకరాల భూమి రాంనేని లక్ష్మయ్య పేరిట పట్టా కలిగి ఉందన్నారు. ఆ భూమిని రామినేని లక్ష్మయ్య తన రెండో కుమారుడు బాలయ్యకు పంపకాల ద్వారా కేటాయించినట్లు తెలిపారు. గిరిజన కుటుంబ సభ్యుల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకున్న కొందరు వ్యక్తులు నకలిపత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆరోపించారు. అట్టి వారసత్వంగా వచ్చిన భూమిలో పట్టాదారుడు పలు రకాల పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. మోఖమీద ఉన్నప్పటికి నకిలీ పత్రాలు సృష్టించి మండల కేంద్రానికి చెందిన పలువురు ఆక్రమించుకోని పట్టాదారుడిని తీవ్రభయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నకలీపత్రాలు సృష్టించి రెవెన్యూ అధికారులను మోసం చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆజ్మీర పూల్‌సింగ్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చల ఎర్రయ్య, మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జల్ల ప్రభాకర్, రామినేని సురేందర్, తదితరులు ఉన్నారు.

ట్రై సైకిల్ కోసం వినతి



వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుడు

చిట్యాల: మండలంలోని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు మంద నాగరాజు ట్రై సైకిల్ కోసం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాక్రమంలో నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ ఖాజా మొహీనుద్దీన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశాడు. తహసీల్దార్ స్పందించి సంబంధిత డీఆర్‌డీఏ శాఖ అధికారులతో మాట్లాడి బ్యాటరీ ట్రై సైకిల్ అందజేసేలా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చాడు.

కమిటీ ఎన్నిక



కమిటీ ఎన్నికలో పాల్గొన్న సంఘం నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కుదురుపల్లి ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ శాఖ కమిటీని ఆ సంఘం మండల అధ్యక్షుడు మేరుగు లక్ష్మణ్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోగుల నాగేందర్, ప్రధాన కార్యదర్శిగా అమరాజు నాగరాజు, ఉపాధ్యక్షుడిగా మారవేణి రాజశేఖర్‌యాదవ్, సహాయకార్యదర్శిగా రత్నం నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరిగా మధుకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగాల రామయ్య, తలారి శ్రీనివాస్, మోటూరి వెంకటేశ్వర్లు, సమ్మయ్య పాల్గొన్నారు.

'పట్టా భూములకు హద్దులు చూపించండి'



వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో వర్కింగ్ జర్నలిస్టులకు రెవెన్యూశాఖ పట్టాలు ఇచ్చిన ఇంటి స్థలాలకు హద్దులు చూపించాలని కాళేశ్వరం జర్నలిస్టులు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆర్ఐ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాళేశ్వరం శివారులోని 119/1లో 12మంది వర్కింగ్ జర్నలిస్టులకు ఒక్కొక్కరికీ 121 గజాల ఇంటి స్థలాన్ని పట్టాలు అందజేసినట్లు తెలిపారు. ఆ ఇంటి స్థలంలో అటవీశాఖ అధికారులు రిజర్వ్ ఫారెస్టుకు చెందిన భూమి అని అడ్డుకుంటున్నారని తెలిపారు. రెవెన్యూ, అటవీశాఖలు సంయుక్తంగా సర్వే చేసి తమకు పట్టాలు ఇచ్చిన భూమికి హద్దులు చూపించాలని కాళేశ్వరం ప్రెస్‌క్లబ్ సభ్యులు ఏల్పుల వెంకటేష్, షేక్ దీన్‌మహ్మద్ వినతిపత్రం అందజేసి కోరారు.

తెగిన చలివాగు తాత్కాలిక రోడ్డు



తెగిపోయిన చలివాగు తాత్కాలిక రోడ్డు

టేకుమట్ల: మండల కేంద్రం నుంచి రాఘవరెడ్డిపేట వెళ్లే దారిలోని చలివాగులో గత ఏడాది వరద ఉధృతికి వంతెన తెగిపోయింది. దీంతో ప్రయాణికుల సౌకర్యార్థం అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కలెక్టర్ నిధులతో నిర్మించిన తాత్కాలిక రోడ్డుపై రవాణా కొనసాగిస్తున్నారు. కాగా సోమవారం వరద ఉధృతికి చలివాగులో ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రయాణికులు నడుచుకుంటూ వాగును దాటుతున్నారు. వాహనాలు మండల కేంద్రానికి రావాలంటే మొగుళ్లపల్లి, చిట్యాల మండలాల నుంచి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా గుత్తేదారు వంతెన పునర్నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేస్తే రవాణా భారం తగ్గుతుందని ప్రజలు కోరుతున్నారు.

గీత కార్మికుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పోలీస్ సిబ్బంది

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన గుర్రపు గట్టయ్య సంవత్సరం క్రితం తాటి చెట్టు పైనుంచి పడడంతో వెన్నుపూస బొక్క విరిగి నడవలేని స్థితిలో ఉన్నాడు. దీంతో స్థానిక పోలీస్ సిబ్బంది సిద్దార్థ, లాల్‌సింగ్ గీత కార్మికుడికి సోమవారం రూ.5వేలు, ఒక బియ్యం బస్తా అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, సుమన్, రాజేందర్, అనిల్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వెంకటాపురం(ఎం): ప్రజలు వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చెంచు కాలనీ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలను పరీక్షించి అనారోగ్యంగా ఉన్న వారికి మందులను అందించారు. అనంతరం వంటశాలను పరిశీలించి మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. విద్యార్థులకు వేడివేడి ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ భవ్య, సీహెచ్ఓ సదానందం, ఎఎన్ఎం స్వర్ణలత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ 56 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

వాజేడు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వాజేడు వైద్యాధికారి మహేందర్ అన్నారు. మండల పరిధిలోని ఏడ్జెర్లపల్లి, ముత్తారం, కొంగాల గ్రామాల్లో సోమవారం మలేరియా జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 32 మందిని పరీక్షించి మందులను అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. దోమ తెరలను వాడాలని దోమలు కుట్టకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ సూర్యప్రకాశ్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్లు కోటిరెడ్డి, వెంకట రమణ, శేఖర్, చాయాదేవి, కన్యాకుమారి, ఆశవర్కర్లు నాగలక్ష్మి, నాగమణి, వెంకటమ్మ ఉన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుచరిత గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాబు, హేమలత తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలి



ర్యాలీ తీస్తున్న అంగన్‌వాడీ చిన్నారులు, టీచర్లు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం, పలుగుల, కుంట్లం గ్రామాల్లోని అంగన్‌వాడీల ఆధ్వర్యంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సూపర్ వైజర్ నాగమణి ఆధ్వర్యంలో బడిబాట బాట ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని, వారి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రీస్కూల్ విద్యగురించి వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు చందుపట్ల స్వరూప, మంచినీళ్ల శ్రీలత, సుశీల, ఒద్ది ఉమామహేశ్వరీ, మచ్చ శైలజ, కొడిపే తిరుపతమ్మ, పాఠశాల ఉపాధ్యాయురాలు సుగుణ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సివిల్‌రైట్స్ డేను నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో అన్ని గ్రామాల్లో సివిల్‌రైట్స్ డేను నిర్వహించాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మేరుగు లక్ష్మణ్ తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రతి నెల అన్ని గ్రామాల్లో సంబంధిత అధికారులతో దళిత అణగారిన ప్రజల ప్రాథమిక హక్కులను వివరించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సకాలంలో ప్రభుత్వ పథకాలు అందే విధముగా సంబంధిత ప్రభుత్వ అధికారులు కృషిచేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తలారి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మోటూరి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి కొండపల్లి రాములు, మండల ఆర్గనైసింగ్ సెక్రటరి అయిల్ల సమ్మాయ్య, మండల సలహాదారు మేరుగు మల్లయ్య, రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరి లింగాల రామయ్య ఉన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రిని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1995–96 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు రూ.10 వేల విలువ గల క్రీడా సామగ్రిని సోమవారం పాఠశాలకు అందించినట్లు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరామ్ రఘుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు పూర్వ విద్యార్థులు చేస్తున్న సహకారం ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పూల్లూరి శ్రీధర్, కృష్ణమూర్తి, బుర్ర చక్రపాణి, పోగళ్ల మహేందర్ రెడ్డి, బుర్ర దేవేందర్, ఈగ కోటేశ్వర్, ఉపాధ్యాయులు రాజమౌళి, నీలిమారెడ్డి, విజయలక్ష్మీ, కల్పన, ఉస్మాన్ అలీ, బుర్ర సద య్య, సుజాత, రామనారాయణ, గద్దం శంకర్, సూదం సాంబమూర్తి, భాస్కర్, బుజ్జమ్మ పాల్గొన్నారు.

'బోగస్ మత్స్యకార సొసైటీని రద్దుచేయాలి'



చేపలు వదులుతున్న గంగపుత్రుల నాయకులు, సభ్యులు

కాళేశ్వరం: మహదేవపూర్‌లోని బోగస్ మత్స్యకారుల సొసైటీని రద్దు చేసి, అసలైన మత్స్యకారులకు న్యాయం చేయాలని మహదేవపూర్ గంగపుత్ర నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మహదేవపూర్‌లోని మందర, ఎర్రచెరువు, దామెర, కొచ్చెరువుల్లో చేపలను గంగపుత్రులు వదిలారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం నాయకులు మాట్లాడుతూ.. 20 సంవత్సరాలు నుంచి నిజమైన గంగపుత్రులమైన మమ్మల్ని మత్స్యకారుల సొసైటీలో సభ్యులుగా చేర్పించుకోవడం లేదన్నారు. తమకు సొసైటీలో సభ్యత్వం ఇవ్వకుండా తమ జీవనోపాధికి అడ్డంకిగా మారిన మహదేవపూర్ మత్స్యకార సొసైటీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి గంగపుత్రులకు సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలని లేదా ఆ సొసైటీని రద్దు చేసి నూతనంగా స్కిల్ టెస్టులు నిర్వహించి కొత్త సొసైటీ ఏర్పాటుకు కృషి చేసి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. నాగుల దర్మయ్య, రాసకట్ల మురళి, ముద్రగడ వెంకట్రాజం, శివ, కాపరబోయిన రామస్వామి, ముద్రగడ సురేష్, నాగుల మధునయ్య, గట్టయ్య, గరిగ ప్రసాద్, సంతోష్, నవీన్, రఘు, శివ, సతీష్, నాగరాజు, మధుకర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్‌కు గాయాలు



మాజీ సర్పంచ్‌ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల: మండలంలోని జడలపేట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రత్నాకర్‌రెడ్డి–పూలమ్మ దంపతులు సోమవారం రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాల పాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. రత్నాకర్‌రెడ్డి–పూలమ్మ దంపతులు రేగొండ మండలం కోడవటంచ ఆలయానికి దర్శనానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మడతపల్లి శివారులో గేదె ఎదురుగా రావడంతో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి పడ్డారు. దీంతో రత్నాకర్‌రెడ్డికి చేయి విరిగింది. అలాగే పూలమ్మకు చేతికి, తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి వారిని ఆస్పత్రిలో పరామర్శించారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా ఇప్ప మొండి



నియామక పత్రం ఇస్తున్న ఎన్నికల అధికారి రాజు

మల్హర్: మండలంలోని తాడిచర్ల సహకార (పీఏసీఎస్) సంఘం నూతన చైర్మన్‌గా ఇప్ప మొండి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాడిచర్ల సహకార కార్యాలయంలో ఎన్నికల అధికారి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన చైర్మన్ ఎన్నికను సోమవారం నిర్వహించారు. కాగా నిర్ణీత గడువులోగా కాంగ్రెస్ పార్టీని చెందిన అభ్యర్థి ఇప్ప మొండి మాత్రమే నామినేషన్ సమర్పించారు. దీంతో మొండిని చైర్మన్‌గా ప్రకటిస్తూ ఎన్నికల అధికారి ఎన్నిక నియామక పత్రాన్ని అందించారు. గత చైర్మన్ రమారావుపై అనర్హత వేటు పడటంతో నూతన చైర్మన్ ఎన్నిక నిర్వహించాల్సి వచ్చినట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు.

సంఘం అభివృద్ధికి కృషి చేస్తా..

పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ ఇప్ప మొండి అన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆశీస్సులతో, కాంగ్రెస్ మండల నాయకులు, తోటి కాంగ్రెస్ డైరెక్టర్ల సహకారంతో 11 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పదవిని కైవసం చేసుకుందన్నారు. రైతులకు సకాలంలో లోన్ మంజూరు చేయడం, ఎరువుల, విత్తనాలు అందించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పీఏసీఎస్ చైర్మన్ పదవిని తన ఖాతాలో వేసుకోవడంతో నాయకులు తాడిచర్ల సెంటర్‌లో ర్యాలీ నిర్వహించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్క సూర్యప్రకాశ్‌రావు, డైరెక్టర్లు తిరుపతిరావు, సర్వేనాయక్, రమేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, అయిత రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు దండు రమేష్, ఇందారపు చంద్రయ్య, కేసారపు చంద్రయ్య, మండల రాహుల్, గద్దం క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మహాముత్తారం: మండలంలోని సింగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎర్నెని చిన్న నర్సయ్య సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరాడు. మంథనిలో ఐటీపరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్టీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుగుణాకర్‌రావు, కనుకునూర్ మాజీ ఎంపీటీసీ తోలెం వెంకటేష్, భాస్కర్‌నాయక్ తదితరులు ఉన్నారు.